# ఈనాడు సినిమా


శ్రియ


అంజలి


హన్సిక


పి.సుశీల, రాధిక, బాలకృష్ణ

## 'సైమా' హంగామా


అల్లు అరవింద్, ప్రగ్యా జైస్వాల్

దక్షిణాది చిత్ర పరిశ్రమలన్నింటినీ ఓ చోటకి చేర్చి... పురస్కారాలతో ప్రోత్సహించే సైమా (సౌత్ ఇండియన్ ఇంటర్నేషల్ మూవీ అవార్డ్స్) - 2018 వేడుక శుక్రవారం రాత్రి దుబాయ్‌లో ఘనంగా జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో తొలి రోజు సందడిగా సాగింది. ఈ వేడుకలో ప్రముఖ గాయని పి.సుశీలకి జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణ చేతులమీదుగా ఈ పురస్కారం అందుకొన్నారామె. బెస్ట్ యూత్ ఐకాన్‌గా హన్సిక పురస్కారం అందుకొన్నారు. ఈ వేడుకలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్రసీమలకు చెందిన తారలు కళ్లు చెదిరే దుస్తులు ధరించి ర్యాంప్‌పై హొయలొలుకుతూ చూపరులకు కనువిందు చేశారు. శ్రియ, అంజలి, ప్రగ్యా జైస్వాల్ తదితరులు వేదికపై హుషారుగా ఆడిపాడుతూ సందడి చేయడంతో అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

## మాట వింటారు... పర్లేదు!


ఎన్టీఆర్, పూజా హెగ్డే

ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అరవింద సమేత వీర రాఘవ'. పూజా హెగ్డే కథానాయిక. త్రివిక్రమ్ దర్శకుడు. ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మాత. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమాని దసరాకు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. ఈ నెల 20న పాటల్ని విడుదల చేస్తున్నారు. శనివారం 'అనగనగనగా అరవింద అట తన పేరు... అందానికి సొంతూరు, అందుకనే ఆ పొగరు' అంటూ సాగే లిరికల్ వీడియోని విడుదల చేశారు. 'టఫ్‌గా కనిపిస్తారు కానీ... మాట వింటారు. పర్లేదు' అనే సంభాషణతో వీడియో మొదలవుతుంది. 'చీకటి లాంటి పగటి పూట... కత్తుల్లాంటి పూల తోట... జరిగిందొక్క వింత వేట... పులిపై పడిన లేడి కథ వింటారా?' అంటూ ఈ గీతం సాగుతుంది. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించగా, తమన్ స్వరాలు సమకూర్చారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ రాయలసీమ యాసలో మాట్లాడుతూ, సిక్స్‌ప్యాక్ దేహంతో అలరించబోతున్నారు.

## మలుపునిచ్చే చిత్రం అవుతుంది


అలీ, చిరంజీవి, ఖయ్యూమ్, గౌతమ్

ప్రముఖ నటుడు అలీ సమర్పణలో ఆయన తమ్ముడు ఖయ్యూమ్‌తో పాటు.. తనిష్క్, రాజన్, షానీ, పృథ్వీ రాజ్, సమీర్, లోహిత్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'దేశంలో దొంగలుపడ్డారు'. గౌతమ్ దర్శకత్వం వహించారు. సాయికుమార్ పాలకూరి నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ని ప్రముఖ కథానాయకుడు చిరంజీవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అలీ ఈ సినిమా గురించి చెప్పడానికి నా దగ్గరికొచ్చినప్పుడు ఖయ్యూమ్ కామెడీ సినిమా చేశాడేమో అనుకున్నా. కానీ ఇది సీరియస్ అని సినిమా ట్రైలర్ చూశాక అర్థమైంది. మానవ అక్రమ రవాణా గురించి నిత్యం వింటూనే ఉన్నాం. అలాంటి ఒక సమకాలీన అంశంతో ఈ చిత్రం తీయడం మంచి పరిణామం. ఖయ్యూమ్ కెరీర్‌కి కచ్చితంగా ఇది మలుపునిచ్చే చిత్రం అవుతుంది. దర్శకుడు గౌతమ్‌కి ఇది తొలి చిత్రమైనా మంచి కథతో, ఉన్నతమైన సాంకేతిక హంగులతో చిత్రాన్ని తెరకెక్కించాడు" అన్నారు.

## దర్శకులు మారారు... కథా మారింది


ఏయన్నార్, ఎస్వీఆర్, ఎన్టీఆర్

అప్పటి ముచ్చట!

కన్నడంలో విఠలాచార్య తీసిన 'మనె తుంబిద హెణ్ణు' చిత్రాన్ని తెలుగులో తీయాలని బి.నాగిరెడ్డి నిర్ణయించుకున్నారు. డి.వి.నరసరాజు చేత స్క్రిప్ట్ రాయించారు. సోదరుడు బి.ఎన్.రెడ్డికి దర్శకత్వం అప్పగించబోయి, కళాత్మక చిత్ర దర్శకుడితో రీమేక్ చేయించడం ఇష్టం లేక పి.పుల్లయ్యను సంప్రదించారు. అయితే ఆయనకి కథ నచ్చలేదు. కానీ నాగిరెడ్డి తగ్గలేదు. ఎలాగైనా 'మనె తుంబిద హెణ్ణు' చిత్రాన్ని తెలుగులో తీయాలన్న పట్టుదలతో తన సహనిర్మాత చక్రపాణికి ఆ ప్రాజెక్ట్‌ను బలవంతంగా అప్పగించారు. కన్నడ కథ చూస్తూనే పెదవి విరిచిన చక్రపాణి పనిగట్టుకుని మూల కథను ఓ మూల పెట్టి, నరసరాజు చేత మొత్తం స్క్రిప్ట్ తిరగ రాయించారు. కమలాకర కామేశ్వరరావును దర్శకుడిగా, సూర్యకాంతాన్ని ప్రధాన పాత్రలో తీసుకుని, ఎన్టీఆర్, ఏయన్నార్, ఎస్వీఆర్, రమణారెడ్డి, సావిత్రి, జమున లాంటి భారీ తారాగణాన్ని ఎంచుకున్నారు. అలా ముందు దర్శకులూ, ఆ తర్వాత కథా మారి తిరుగులేని విజయం సాధించిన చిత్రమే విజయా వారి 'గుండమ్మ కథ'.

– శ్రీవత్స

## మనసుల్ని దోచేస్తుంది


ఆర్.ఎస్.నాయుడు

"జీవితంలో ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో యువతరం తెలుసుకోవాలి. అది తెలిసినప్పుడే జీవితాలు సరైన దారిలో వెళతాయని చెప్పే ప్రయత్నం 'నన్ను దోచుకుందువటే..'తో చేశా. ఓ మంచి రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా చిత్రాన్ని తీశా" అన్నారు దర్శకుడు ఆర్.ఎస్.నాయుడు. సుధీర్‌బాబు కథానాయకుడుగా నటిస్తూ, నిర్మించిన చిత్రమిది. నభా నటేష్ నాయిక. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆర్.ఎస్.నాయుడు హైదరాబాద్‌లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. "ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే కుర్రాడి జీవితంలోకి ఓ అమ్మాయి ప్రవేశించాక ఏ విధమైన మార్పులొచ్చాయనేది ఈ చిత్రంలో ఆసక్తికరం. యువతరం మనసుల్ని దోచుకొంటుంది. ప్రేమ, హాస్యానికి ప్రాధాన్యం ఉంది. ప్రచార చిత్రాలకీ, పాటలకీ మంచి స్పందన లభిస్తోంద"న్నారు ఆర్.ఎస్.నాయుడు. తన సినీ ప్రయాణం గురించి చెబుతూ "మాది అనంతపురం జిల్లాలోని తాడిపత్రి. డిగ్రీ అయ్యాక సినిమాలపై ఆసక్తితో కొన్ని కథలు రాశా. 'నీ మాయలో', 'స్పందన' లఘు చిత్రాలు తీశా. తర్వాత 'నన్ను దోచుకుందువటే' కథ రాశా. అది సుధీర్‌బాబుకి నచ్చడంతో దర్శకుడ్ని అయ్యా. భవిష్యత్తులో నా కథల్ని కమర్షియల్ కోణంలోనే తెరకెక్కిస్తా. ఈ సినిమాకి ముందే ఓ నిర్మాతకి కథ చెప్పి ఒప్పించాన"ని తెలిపారు నాయుడు.

## ఏం చేసినా ప్రత్యేకత ఉండాలి



**కొత్తదనమున్న చిత్రాలకి తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. అలా మా 'యు టర్న్' చిత్రాన్నీ ఆదరిస్తుండడం ఆనందంగా ఉంద"న్నారు పవన్‌కుమార్. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రానికి శ్రీనివాస్, రాంబాబు నిర్మాతలు. సమంత ప్రధాన పాత్రలో నటించింది. ఆది పినిశెట్టి, భూమిక, రాహుల్ రవీంద్రన్ కీలక పాత్రల్లో నటించారు. వినాయకచవితికి విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం దర్శకుడు పవన్‌కుమార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.**

- తొలుత ఈ కథను కన్నడలో తెరకెక్కించాను. విజయాన్ని సాధించింది. విడుదలకి ముందే ప్రచార చిత్రాన్ని చూసిన సమంత నాకు ఫోన్ చేసి మాట్లాడారు. తనకు సినిమా పట్ల ఉన్న ప్రేమ నచ్చింది. అప్పుడే తనకు ఈ కథని చెప్పాను. తెలుగులో తీయమని చెప్పారు. ఆ తర్వాత నాగచైతన్య పరిచయమయ్యారు. నా సినిమా ప్రమోషన్‌లోనూ ఆయన పాలుపంచుకున్నారు. ఎప్పట్నుంచో తెలుగులో రీమేక్ చేయాలని అనుకున్నా, సమంత బిజీగా వున్నందున ఇప్పటికి తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. నిర్మాతలు శ్రీనివాస్,రాంబాబు చాలా సహకరించారు.
- బెంగళూరులోని డబుల్ ఫ్లైఓవర్‌పైన యు టర్న్‌లో జరిగిన ఓ ప్రమాదమే ఈ కథ రాసే ప్రేరణని కలిగించింది. ట్రాఫిక్ గురించి ప్రజల్లో మరింత జాగరూకత కలిగించాలనే తెలుగు, తమిళ భాషల్లో చేశా. తెలుగులోని కమర్షియాల్టీని, బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేశా. తెలుగులోని చివరి అర్ధగంట సన్నివేశాలు కన్నడలో ఉండవు. సమంతకి సవాల్‌గా నిలిచే పాత్రలో అనుభవం ఉన్న నటి ఉండాలనే ఆలోచనతో భూమికను సంప్రదించాం. నేను ఒకే జోనర్‌కి పరిమితం కాను. ఏం చేసినా ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటా.
- మాది బెంగళూరు. ఇంజినీరింగ్ చదివే దశలోనే థియేటర్ ఆర్ట్స్‌లో చేరి ఏడేళ్ల అనుభవాన్ని సంపాదించాను. తర్వాత తొలి ప్రయత్నంగా 'లైఫ్ ఇంతేలే' అనే కాన్సెప్ట్ సినిమా మలిచా. రెండో చిత్రంగా క్రౌడ్ ఫండింగ్ విధానంలో 'లూసియా' చిత్రాన్ని తీశా. నేను ఎక్కువగా అకిరా కురసోవా, స్పీల్‌బర్గ్, అనురాగ్ కశ్యప్ సినిమాల్ని ఇష్టపడతాను. తెలుగులో నా తదుపరి చిత్రాన్ని ఈ సంస్థలోనే చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## అవకతవకలు జరగలేదు


శివాజీరాజా, నరేష్

"అపోహలు... పరస్పర అవగాహన లోపం వల్లే 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) కార్యవర్గంలో విభేదాలొచ్చాయి. ఇకపై మా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిసిమెలిసి సదవగాహనతో ఉంటారు. ఏ సమస్య గురించైనా కలెక్టివ్ కమిటీనే ఇకపై మీడియాతో మాట్లాడుతుంద"న్నారు ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు. 'మా' భవనం కోసం చేపడుతున్న నిధుల సేకరణలో అవకతవకలు జరిగాయనే విషయంపై కొన్ని రోజుల కిందట 'మా' అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మీడియా ముందుకొచ్చి పరస్పరం ఆరోపణలు చేసుకొన్నారు. ఈ సమస్యని పరిష్కరించేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ కలెక్టివ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ... నిధుల సేకరణ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని తేల్చింది. ఆ వివరాలను చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కమిటీలో భాగమైన డి.సురేష్‌బాబు, కె.ఎల్.నారాయణ, పర్వతనేని కిరణ్, తమ్మారెడ్డి భరద్వాజ, కె.ఎల్.నారాయణ మాట్లాడుతూ "చిత్రపరిశ్రమలో అంతా అన్నదమ్ముల్లా సఖ్యతతో మెలుగుతూ, పొరపాట్లని పరిష్కరించుకోవాల"ని కోరారు. శివాజీరాజా మాట్లాడుతూ "మా మధ్య వచ్చిన మనస్పర్థల్ని, నిధులకి సంబంధించిన వివరాల్నీ కమిటీ ముందుంచాం. వాటిని పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేవని తేల్చేసింద"న్నారు. నరేష్ మాట్లాడుతూ "జరిగిందేదో జరిగిపోయింది. రానున్న రోజుల్లో సినీ పెద్దల సహకారంతో మేమిద్దరం సఖ్యతగా మెలగుతాం. పరిశ్రమాభివృద్ధి కోసం 'మా' తరఫున నిర్వహించే కార్యక్రమాలు విజయవంతం కావడానికి కృషి చేస్తామ"న్నారు.

## ఎంత ముద్దొస్తున్నారో..!

'మా సినిమాలో ఎన్ని ముద్దులు ఉన్నాయో లెక్క పెట్టలేదు'.
- ఒక దర్శకుడి మాట

'ఎన్ని ముద్దులున్నాయని కాదు... సినిమాలో ఆ సన్నివేశాలు ఎంతసేపు సాగాయనే విషయం గురించే ఎక్కువగా మాట్లాడుకొంటారు'.
- ముద్దు సన్నివేశాల్లో నటించిన ఓ కథానాయకుడి మాట ఇది.

'ముద్దులంటే బాలీవుడ్ హీరోలే పెట్టుకోవాలా? మనకెవ్వరికీ ముద్దుల గురించి తెలియదా? మన వాళ్లెవరూ ముద్దులు పెట్టుకోరా?'
- మరో కథానాయకుడి అభిప్రాయం ఇది.

ఈ ధోరణిని బట్టి మన చిత్రసీమ, మన తారలు ముద్దు సన్నివేశాల విషయంలో ఎంత దూరం వెళ్లారో అర్థమవుతోంది.

ఇదివరకు 'ఇవ్వూ ఇవ్వూ ఒక్క ముద్దు...' అంటూ కథానాయకుడు వెంటబడితే... 'ఇవ్వలేంది అడగవద్దు' అంటూ కథానాయిక నో చెప్పేది. 'కన్నె ముద్దు ఇచ్చుకుంటే చిన్నవాడా పెళ్లి దాకా ఆగవంటా..' అంటూ అతని ఉత్సాహాన్ని అక్కడితో కట్టడి చేసేది. కానీ కాలం గడిచేకొద్దీ, ట్రెండ్ మారుతున్నకొద్దీ ముద్దు సన్నివేశాల్లోనూ మార్పులొచ్చాయి. 'ముక్కుపై ముద్దు పెట్టు ముక్కెరైపోయేట్టు... చెంపపై ముద్దు పెట్టు చెక్కరైపోయేట్టు..' అంటూ ఇప్పుడు కథ రీత్యా కథానాయికలు రెచ్చగొడుతున్నారు. దాంతో చుంబన దృశ్యాలు తెరపై విరివిగా దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు ముద్దు సన్నివేశాలంటే నాయకానాయికలు దగ్గరికి చేరగానే ఉన్నట్టుండి మధ్యలో ఓ పువ్వునో లేదంటే, ఓ గొడుగునో అడ్డుగా చూపించేవారు. కథానాయిక బుగ్గలు తుడుచుకొంటూ సిగ్గు పడుతూ వెళ్లిపోవడం చూపించి, ముద్దు అయిపోయిందనిపించేవారు. కానీ ఇప్పుడు అలాంటి అడ్డు తెరలే అవసరం లేదంటూ రెచ్చిపోతున్నారు. నేరుగా ఎంగిలి ముద్దులతో వెండితెరని వేడెక్కిస్తున్నారు. ఇదివరకటితో పోలిస్తే ఈమధ్య ఎక్కువ చిత్రాల్లో ముద్దు సన్నివేశాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవలే విడుదలై విజయవంతమైన 'గీత గోవిందం' కథ ముద్దు చుట్టూనే తిరుగుతుంది. '24 కిస్సెస్' అంటూ అదిత్ అరుణ్, హెబ్బా పటేల్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇదివరకు ముద్దు సన్నివేశం అనగానే అమ్మో వద్దూ... అనేవారు నాయికలు. అలాంటి సన్నివేశాలకి మేం దూరం అని చెప్పేవాళ్లు. కానీ క్రమంగా ఆ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకొన్నాయి. కథ, పాత్రలు డిమాండ్ చేస్తే మేం ముద్దులొలికించడానికి సిద్ధం అంటూ ధైర్యంగా ముందుకొస్తున్నారు. ముద్దు కూడా భావోద్వేగాల్ని పండించడంలో ఓ భాగమే అనేది వాళ్ల అభిప్రాయం. దర్శకులు కూడా ప్రేమ భావనల్ని మరింత లోతుగా చూపించడం కోసమేనంటూ ముద్దు సన్నివేశాల్ని ఆశ్రయిస్తున్నారు.


అను ఇమ్మాన్యుయేల్

### కొత్తేం కాదు...

చుంబన సన్నివేశాల గురించి ఈమధ్య చర్చ ఎక్కువైంది కానీ... ఈ ఉద్ధృతి మొదలై చాలా కాలమే అయ్యింది. 'ఏమాయ చేసావె'లో నాగచైతన్య, సమంతలు ముద్దు సన్నివేశాలతో స్వచ్ఛమైన ప్రేమ భావనల్ని పలికించారు. 'వేదం', 'ఆర్య2' తదితర చిత్రాలతో పాటు, 'తీన్ మార్'లో పవన్‌కల్యాణ్, త్రిషల మధ్య కూడా ముద్దు సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరించాయి. గతేడాది ప్రేక్షకుల ముందుకొచ్చిన 'అర్జున్‌రెడ్డి' నుంచి ముద్దుల సందడి మరింత ఎక్కువైంది. ముద్దులతో కూడిన పోస్టర్లతో ఆ సినిమాకి ప్రచారం చేశారు. థియేటర్లలో విజయ్ దేవరకొండ, షాలిని పాండేల మధ్య సన్నివేశాలు కుర్రకారుని మరింత అలరించాయి. విజయవంతమైన 'ఆర్.ఎక్స్.100'లో కార్తికేయ, పాయల్ రాజ్‌పుత్‌ల మధ్య సుదీర్ఘమైన ముద్దు సన్నివేశాలు తెరపై దర్శనమిస్తాయి. 'గూఢచారి'లో తెలుగమ్మాయి శోభిత ధూళిపాళ, అడవి శేష్‌ల మధ్య చుంబన దృశ్యాలు ఆ సినిమాని మళ్లీ మళ్లీ చూసేలా చేశాయి. 'జిల్' మొదలుకొని, 'తొలిప్రేమ' వరకు పలు చిత్రాల్లో రాశిఖన్నా కూడా ముద్దులొలికించారు. ఇటీవలే విడుదలైన 'శైలజారెడ్డి అల్లుడు'లోనూ నాగచైతన్య, అను ఇమ్మాన్యుయేల్‌ల పెదాలు కలుస్తాయి. అగ్ర కథానాయకుల చిత్రాలకి ప్రేక్షకుల్లో అంచనాలుంటాయి కాబట్టి వాటికి పెద్దగా ప్రచారం అవసరం లేదు. కానీ స్టార్లు లేని చిత్రాలు మాత్రం ఈమధ్య ముద్దులతోనే ప్రచారం చేసుకొంటూ ప్రేక్షకుల్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రస్తుతం సినిమాల్ని ఎక్కువగా చూస్తున్నది యువతరమే కాబట్టి వాళ్లని ఆకట్టుకోవాలంటే ముద్దుల్ని ఆశ్రయించడమే మేలని భావించేవాళ్లు కూడా ఎక్కువే. యువ కథానాయకుడు ఆది పినిశెట్టి మాట్లాడుతూ "కథకి అవసరం లేకుండా ముద్దులు, గాఢమైన సన్నివేశాలు చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు. కథ డిమాండ్ చేస్తున్నప్పుడు వాటిని ఆశ్రయిస్తే తప్పేం లేదు. ప్రస్తుతం 'ఆర్.ఎక్స్.100' తమిళ రీమేక్‌లో నటిస్తున్నా. తెలుగు సినిమాలో ఉన్నట్టుగానే అక్కడ కూడా ముద్దు సన్నివేశాలుంటాయి. కథకి వాటి అవసరం ఉంది" అంటున్నారు.


శోభిత


పాయల్


రాశి ఖన్నా


షాలినీ పాండే